క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిక



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండలంలోని కృష్ణాజీవాడి గ్రామానికి చెందిన సింగిల్‌విండో డైరెక్టర్, బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు శేర్‌బద్దం రమణారెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు పార్టీ సీనియర్ నాయకుడు శ్యాంరావు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు.

ఐటీఐ కాలేజీ తనిఖీ



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండల కేంద్రంలోని ఐటీఐ కాలేజీని మంగళవారం మండల ప్రత్యేక అధికారి శివ కుమార్ తనిఖీ చేశారు. కాలేజీలో ఎంతమంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు.. ఇంకా ఎన్ని సీట్లు ఖాళీ ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. కాలేజీకి సంబంధించిన వివరాలను పొందుపరచిన కంప్యూటర్‌ను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ, ఎంపీవో సవిత, ప్రిన్సిపల్ కనకయ్య, సిబ్బంది ఉన్నారు.

ఆర్యవైశ్య సంఘం నేతకు కన్నీటి వీడ్కోలు



భిక్కనూరు: ఆర్యవైశ్య సంఘ రాష్ట్ర నేత గంప రాజేశంకు మంగళవారం కన్నీటి వీడ్కోలు పలికారు. రాజేశం మృతి వార్త తెలిసి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్దన్ భిక్కనూరుకు వచ్చి మృతదేహం వద్ద నివాళులర్పించారు. రాజేశం భార్య రాధాబాయితో పాటు కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. మధ్యాహ్నం మండల కేంద్రంలో జరిగిన రాజేశం అంత్యక్రియల్లో అన్ని పార్టీల నేతలు వ్యాపారులు పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.

సీపీఐ 4వ మహాసభలను విజయవంతం చేయాలి



బాన్సువాడ: మేడ్చల్ జిల్లా గాజుల రామారంలో నెల 20, 21,22 తేదీల్లో జరిగే సీపీఐ 4వ మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దుబాస్ రాములు పిలుపునిచ్చారు. మంగళవారం బాన్సువాడలో ఆయన మాట్లాడారు. ఈ మహాసభలకు జాతీయ నాయకులు, సీపీఐ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మాజీ పార్లమెంట్ సభ్యులు హాజరవుతున్నారని తెలిపారు. నూతన ఎజెండాతో పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ తదితర కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. నాయకులు శంకర్, సురేష్, రాములు, గంగాధర్, కృష్ణ, నర్సింలు, గంగామణి, జమున, సంగయ్య తదితరులు ఉన్నారు.

ప్రాథమిక పాఠశాలకు కార్పెట్లు, లైనర్ల విరాళం



కామారెడ్డి అర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 1971–72 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు డాక్టర జి.హన్మంతురావు, కంకణాల శ్రీశైలం, దొడ్ల బాలయ్య, కృష్ణమూర్తిలు దేవునిపల్లి కాకతీయ నగర్ ప్రాథమిక పాఠశాలకు కార్పెట్లు, లైనర్లు విరాళంగా అందజేశారు. విద్యార్థులు కూర్చుని మధ్యాహ్న భోజనం చేయడానికి అనుకూలంగా కార్పెట్లు, లైనర్లు అందజేసినందుకు హెడ్ మాస్టర్ శైలజ ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యాయులు నిషాత్ సుల్తానా, స్రవంతి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీఆర్ విద్యార్థుల ప్రతిభ



కామారెడ్డి టౌన్: హైదరాబాద్‌లోని టీ హబ్‌లో మంగళవారం జరిగిన ఇండియన్ స్పేస్ ఎడ్యూకేషన్‌- 2025 కాన్ఫరెన్స్ పోటీలలో జిల్లా కేంద్రంలోని ఎస్పీఆర్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. రాకెట్ లాంచింగ్ వెహికిల్స్ అనే విభాగంలో ఎస్పీఆర్ పాఠశాల విద్యార్థులు మహతి, కేయూరి, సుసేన్, శ్రీనిధి, నియాలు తృతీయ బహుమతి గెలుపొందారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ మారుతి అభినందించారు. ఈ పోటీలలో వందకుపైగా పాఠశాలలు పాల్గొన్నాయి.

వాగులతో తప్పని తిప్పలు

- వానాకాలంలో జలదిగ్బంధంలో చిక్కుకుంటున్న పల్లెలు
- లోలెవల్ వంతెనలే కారణం
- వర్షాలు వస్తే రాకపోకలు పూర్తిగా బంద్
- నిధుల కోసం ఎదురుచూపులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



కుర్లా సమీపంలో నిలిచిన రాకపోకలు



రెండు రోజుల క్రితం లింబుర్‌వాడిలో మందులు ఇవ్వడానికి వాగులోంచి వెళ్తున్న ఆశావర్కర్లు

మద్నూర్(జుక్కల్): వర్షాకాలంలో ప్రతి ఏడాది ఆయా గ్రామాల మధ్య ఉన్న లోలెవల్ వంతెనల పైకి వాగు నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. భారీ వర్షాలతో వాగుల్లోని వరద నీరు గ్రామాలను చుట్టేయడంతో పల్లెలు జల దిగ్బంధంలో చిక్కుకుపోతున్నాయి. ఉమ్మడి మద్నూర్, డోంగ్లీ మండలంలోని గోజేగావ్, లింబుర్ వాడి, చిన్న టాక్లీ, పెద్ద టాక్లీ, తడిహిప్పర్గా, సోనాల, అంతాపూర్, సోమూర్, సిర్‌పూర్ గ్రామాలకు వెళ్లే రహదారులను అధికారులు మూసివేస్తున్నారు. ఆయా గ్రామాల సమీపంలో లెండి, మంజీర వాగులు ప్రవహిస్తుండటంతో పాటు ఎన్నో ఏళ్ల కిందట నిర్మించిన లోలెవల్ వంతెనలు భారీ వర్షానికి నీటిలో మునిగిపోతున్నాయి. కానీ నిధులు మంజూరు కాకపోవడంతో అనేక గ్రామాల మధ్య లోలెవల్ వంతెనలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో కొందరు వాగులు దాటుతున్న సమయంలో కొట్టుకుపోయారు.

అసలు వంతెనే లేదు..

డోంగ్లీ మండలంలోని లింబుర్ నుంచి లింబుర్‌వాడికి వెళ్లే రహదారిపై లెండి వాగు ప్రవహిస్తుంది. ఈ వాగుపై ఇప్పటి వరకు ఎన్నో ప్రభుత్వాలు మారినా.. వర్షా కాలంలో నడుము లోతు నీటిలోంచి నడుచుకుంటూ ప్రయాణాలు చేస్తున్నా అధికారులలు, ప్రజాప్రతినిధులు కనికరించడం లేదని వాడి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల భారీ వర్షాలతో మూడు రోజుల పాటు ఈ గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుంది. బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, రెవెన్యూ, పోలీసు అధికారులు వాగు ఇవతలి నుంచి పరామర్శించి వెళ్లారని వంతెన నిర్మించాలని వారితో కోరినట్లు వాడి గ్రామస్తులు తెలిపారు.

తక్కువ ఎత్తులో నిర్మించడంతోనే..

ఉమ్మడి మద్నూర్, డోంగ్లీ మండలాల్లోని గోజేగావ్, చిన్న టాక్లీ, పెద్ద టాక్లీ, సిర్‌పూర్, అంతాపూర్, తడిహిప్పర్గా గ్రామాల మధ్యలో నిర్మించిన వంతెనలు తక్కువ ఎత్తులో ఉండటంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. ప్రధానంగా మద్నూర్–జుక్కల్ ప్రధాన రహదారి, మద్నూర్–గోజేగావ్, మద్నూర్–సిర్‌పూర్ మధ్యలోని వాగులు ఉగ్రరూపం దాల్చడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది.

ప్రతి ఏడాది అంతరాయం



ప్రతి ఏడాది వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా సర్కార్ మాత్రం పట్టించుకోవడం లేదు. వానాకాలంలో మూడు నుంచి నాలుగు రోజుల వరకు వంతెన మునిగిపోవడంతో ప్రజలు కష్టాలు పడుతున్నారు. గ్రామాల మధ్య నున్న పురాతన వంతెనల స్థలంలో ఎత్తు పెంచి నూతన వంతెనలు నిర్మిస్తేనే సమస్య తొలగిపోతుంది.

– బస్వరాజ్ పటేల్, తడిహిప్పర్గా

హైలెవల్‌గా మారుస్తాం



జుక్కల్ నియోజకవర్గంలో ముంపునకు గురైన అన్ని గ్రామాలను పర్యటిస్తున్నాను. గతంలో ఉన్న ప్రభుత్వాలు వాగు వద్ద వంతెనలను గ్రౌండ్ లెవల్‌లో నిర్మించడంతో వాగులు పొంగినప్పుడు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ సమస్య పరిష్కారం కోసం అధికారులతో ప్రతిపాదనలు సిద్ధం చేయించి నిధులు మంజూరు చేస్తాను.

– తోట లక్ష్మీకాంతారావు, ఎమ్మెల్యే, జుక్కల్

ఇంకా జల దిగ్బంధంలోనే గోజేగావ్

మద్నూర్(జుక్కల్): మద్నూర్–గోజేగావ్‌కు రెండు రోజులుగా రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోజేగావ్‌కు వెళ్లే రహదారిపై లెండి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గోజేగావ్ గ్రామస్తులు రెండు రోజులు ఊర్లోనే బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. మంగళవారం గోజేగావ్‌కు వెళ్లే రహదారిపై లోలెవల్ వంతెన పూర్తిగా నీటిలో మునిగిపోవడంతో మండల కేంద్రానికి వారికి రాకపోకలు నిలిచిపోయాయి. మహారాష్ట్రలో సైతం భారీ వర్షాలు కురవడంతో లెండి వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో గోజేగావ్ గ్రామస్తులు మండల కేంద్రానికి చేరుకోవాలంటే గోజేగావ్ నుంచి మహారాష్ట్రలోకి ప్రవేశించి దెగ్లూర్ మీదుగా 25 కిలోమీటర్లు ప్రయాణించి మద్నూర్‌కు చేరుకుంటున్నారు.



గోజేగావ్ వద్ద వంతెనపై నుంచి పారుతున్న వరద

వర్షాలకు దెబ్బతిన్న పంటల పరిశీలన



చీనూర్‌లో నీటమునిగిన పంటలను పరిశీలిస్తున్న ఆర్డీవో పార్థసింహారెడ్డి



చిన్నకొడప్‌గల్‌లో..



గాంధారి మండలం సర్వాపూర్‌లో.. ఏవో రాజలింగం



తాడ్కోల్ క్లస్టర్‌లో .. ఏఈవో రాణి



తాడ్కోల్‌లో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీవో ఆనంద్



బిచ్కుందలో కూలిపోయిన ఇల్లు

జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మంగళవారం పరిశీలించారు. పంట నష్ట వివరాలను నమోదు చేసి పైఅధికారులకు నివేదిస్తామని ఈ సందర్భంగా అధికారులు చెప్పారు. వరి పంటలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడాలని రైతులకు సూచించారు. అలాగే కూలిపోయిన ఇళ్లను పరిశీలించారు. బాధితుల వివరాలు నమోదు చేసుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

ఆధ్యాత్మికం

ఘనంగా బారడి పోచమ్మ తల్లి బోనాల పండుగ



పిట్లం(జుక్కల్): గౌడ్మెగాంలో బారడి పోచమ్మ తల్లి బోనాల పండుగను మంగళవారం గ్రామస్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకొని, డీజే చప్పుళ్లు, శివసత్తుల నృత్యాల మధ్య ఊరేగింపుగా గ్రామ శివారులోని బారడి పోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల ఊరేగింపులో శివసత్తుల ప్రదర్శన ఆకట్టుకుంది.

మంగ్లూర్‌లో..

నిజాంసాగర్(జుక్కల్): మంగ్లూర్‌లో బారెడు పోచమ్మ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం గ్రామస్తులు బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బోనాలతో బ్యాండు మేళాలు, భజన సంకీర్తనలతో అమ్మవారి ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లారు. అమ్మవారి ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేశారు.

త్రిశక్తి అమ్మవార్లకు ఘనంగా లక్ష పుష్పార్చన



కామారెడ్డి అర్బన్: స్థానిక త్రిశక్తి ఆలయంలోని అమ్మవార్లకు మంగళవారం లక్ష పుష్పార్చన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అర్చన పుష్పాలను అందజేశారు. బ్రాహ్మణ వికాస్ పరిషత్ అధ్యక్షుడు అర్జున్‌రావు, ఆలయ నిర్వహణ కమిటీ ప్రతినిధులు భాస్కర్‌రావు, రాంమోహన్, అర్చకులు పాల్గొన్నారు.

బీర్కూర్- బిచ్కుంద మధ్య రాకపోకల నిలిపివేత

బాన్సువాడ: బీర్కూర్–బిచ్కుందకు వెళ్లే మార్గంలో గైపీర్ల వాగు వద్ద నీటి ప్రవాహం పెరగడంతో అధికారులు రాకపోకలు నిలిపివేశారు. గ్రామ పంచాయితీ ట్రాక్టర్లు అడ్డుగా పెట్టి వాహనాలు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. తహసీల్దార్ గణేష్, ఎస్సై రాజశేఖర్, బీర్కూర్ పంచాయతీ కార్యదర్శి గంగాధర్ తదితరులు అప్రమత్తమై రోడ్డును మూసివేయించారు.

తగ్గిన మత్తడి వాగు ప్రవాహం

రామారెడ్డి: మండలంలో సోమవారం 3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ ఉమాలత తెలిపారు. రామారెడ్డిలో పురాతన ఇల్లు ఒకటి కూలిపోయినట్లు పేర్కొన్నారు. కన్నాపూర్ మత్తడి వాగు, ఘనపూర్ వాగు నీటి ప్రవాహం ఉధృతి తగ్గడంతో రాకపోకలు కొనసాగుతున్నట్లుగా తెలిపారు.

చెరువు తూము వద్ద గొయ్యి పూడ్చివేత

బాన్సువాడ రూరల్: కోనాపూర్ తిమ్మసముద్రం చెరువు తూము వద్ద గండి ఏర్పడటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు మంగళవారం జేసీబీతో మొరం వేసి కట్టను బలోపేతం చేశారు. ఇరిగేషన్ డీఈ జగదీష్, ఏఈ నితిన్, మాజీ సర్పంచ్ వెంకటరమణరావు దేశ్‌ముఖ్, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ సేవించి యువత పెడదారి పట్టొద్దు



అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో మంగళవారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పిట్లం ఎస్సై వెంకట్రావు ఆధ్వర్యంలో షీటీం, పోలీస్ కళాబృందం సభ్యులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మహిళలకు రక్షణ కల్పించాలనే ఉద్దేశంతోనే షీటీంలను ఏర్పాటు చేశామన్నారు. అత్యవసర సమయంలో 100కు ఫోన్ చేయాలని, బాలికలు, మహిళలు భయాన్ని విడనాడాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమన్నారు. డ్రగ్స్ సేవించి యువత పెడదారి పట్టొద్దన్నారు. యువతీ యువకులు తల్లిదండ్రుల మాట వినాలని, వారిని గౌరవించాలన్నారు. సోషల్ మీడియాతో జాగ్రత్తగా ఉండాలన్నారు. బాన్సువాడ షి టీమ్స్ సభ్యులు అనిల్, ప్రియాంక, కళాబృందం ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ రామంచ తిరుపతి, శేషారావు, ప్రభాకర్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు కట్టుకోవాలి

- బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి



బాధితులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

నిజాంసాగర్(జుక్కల్): రేకుల షెడ్లు, పూరిగుడిసెల్లో నివాసం ఉంటున్న నిరుపేదలు ఇందిరమ్మ ఇళ్లు కట్టుకోవాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. మంగళవారం మహమ్మద్‌నగర్ మండలంలోని తుంకిపల్లిలో పునరావాస బాధిత కుటుంబాలను సబ్ కలెక్టర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..బాధితులు ఇందిరమ్మ ఇళ్లు కట్టుకునేందుకు ముందుకు వస్తే ఇళ్లను మంజూరు చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మహమ్మద్‌నగర్ తహసీల్దార్ సవాయి సింగ్, డిప్యూటీ తహసీల్దార్ కాంత్రికుమార్, గిర్దావర్ పండరి తదితరులున్నారు.

రైతులను ఆదుకుంటాం

- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

మద్నూర్/బిచ్కుంద(జుక్కల్): వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అన్నారు. మంగళవారం బిచ్కుంద మండలం పుల్కల్ శివారులో, మద్నూర్, డోంగ్లీ రెండు మండలాల్లోని దన్నూర్, లింబుర్ వరద ప్రాంతాల్లో నీటమునిగిన పంటలను పరిశీలించారు. రైతులు, వ్యవసాయ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. సర్వే చేసిన నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. సీఎం, వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారం అందే విధంగా చూస్తానని ఎమ్మెల్యే రైతులకు భరోసా కల్పించారు.

టీఎల్‌ఎం మేళాను వాయిదా వేయడం సరికాదు



మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలో మంగళవారం జరగాల్సిన టీఎల్‌ఎం మేళాను మండలంలోని ఒక ఉపాధ్యాయ సంఘం నాయకులు అనధికారికంగా వాయిదా వేయడం వల్ల మండలంలోని ఉపాధ్యాయులు అయోమయానికి గురయ్యారని తపస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో తెలంగాణ పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడు రాము, ప్రధాన కార్యదర్శి సభాత్ క్రిష్ణతో కలిసి మాట్లాడారు. డీఈవో ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం నాగిరెడ్డిపేట మండలంలో మంగళవారం టీఎల్‌ఎం మేళాను నిర్వహించాల్సి ఉందని వారు చెప్పారు. జిల్లా విద్యాశాఖ నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాకున్నా కొందరు అత్యుత్సాహం చూపించి వాయిదా వేశారన్నారు. సొంత నిర్ణయాలు తీసుకొని ఉపాధ్యాయులను పక్కదారి పట్టించినవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

చేపలు పట్టడానికి వెళ్లొద్దు



భిక్కనూరు: భారీ వర్షాలతో చెరువులు నిండి అలుగు పారుతున్నాయని, మత్స్యకారులు, యువకులు చేపలు పట్టడానికి చెరువుల వద్దకు వెళ్లవద్దని ఇరిగేషన్ ఏఈ ఆనందం సూచించారు. మంగళవారం బస్వాపూర్ శివారులోని అలుగు పారుతున్న పటేల్ చెరువును పరిశీలించారు. చెరువు నిండడంతో గ్రామ నాయకులు, రైతులు గంగమ్మకు కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ తుడుం స్వామి, మాజీ ఉప సర్పంచ్ రామగళ్ల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

డీజేలకు అనుమతి లేదు



కామారెడ్డి క్రైం: గణేశ్ ఉత్సవాలలో డీజేలకు అనుమతి లేదని పట్టణ ఎస్‌హెచ్‌వో నరహరి తెలిపారు. జిల్లా కేంద్రంలో గణేశ్ పండుగ నేపథ్యంలో డీజే నిర్వాహకులతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం డీజేలకు అనుమతి లేదన్నారు. నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తమ డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని కోరుతూ మంగళవారం నాగిరెడ్డిపేటలోని వివిధ గ్రామాలకు చెందిన ఆశావర్కర్లు స్థానిక పీహెచ్‌సీ ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు రావాల్సిన జూలై నెలకు సంబంధించిన పారితోషకాన్ని వెంటనే చెల్లించాలన్నారు. దీంతోపాటు నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లిస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం తమకు రూ.50 లక్షల ఇన్సూరెన్స్ చెల్లించేలా ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. తమలో ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం ట్రైనింగ్ పూర్తి చేసినవారికి పదోన్నతులు కల్పించాలన్నారు. అనంతరం పీహెచ్‌సీ డాక్టర్ సృజన్‌కు వారు వినతి పత్రాన్ని అందజేశారు.



నాగిరెడ్డిపేట పీహెచ్‌సీ ఎదుట ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

మత్తమాల పీహెచ్‌సీ ఎదుట..

ఎల్లారెడ్డి: పెండింగ్ వేతనాలను చెల్లించాలని కోరుతూ ఆశావర్కర్లు మంగళవారం మత్తమాల పీహెచ్‌సీ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. మెడికల్ ఆఫీసర్ శరత్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు మంజుల, సవిత తదితరులున్నారు.

భర్త చితికి నిప్పు పెట్టిన భార్య

భిక్కనూరు: మండల కేంద్రంలో భర్త చితికి భార్య నిప్పు పెట్టిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. సిరిసిల్లా పట్టణానికి చెందిన బాల్‌రాజు తన భార్య సరస్వతి, కుమారుడు శ్రీనివాస్‌తో కలిసి కొన్నేళ్లుగా భిక్కనూరుకు వచ్చి నివాసం ఉంటున్నారు. శ్రీనివాస్ ఆరు నెలల క్రితం గల్ఫ్ దేశానికి వెళ్లాడు. బాల్‌రాజు (60) సోమవారం రాత్రి మృతి చెందాడు. కుమారుడు శ్రీనివాస్ గల్ఫ్ దేశం నుంచి వచ్చే అవకాశం లేకపోవడంతో ఈ విషయాన్ని బంధువులు, గ్రామస్తులు సరస్వతికి తెలియజేశారు. దీంతో ఆమె ముందుకు వచ్చి అంత్యక్రియాల ఆచారాలను నిర్వహించి చితికి నిప్పుపెట్టింది.

సంక్షిప్తం

స్వర్ణకారుల నిరసన



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో మంగళవారం స్వర్ణకారులు నిరసన వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి తమ వృత్తులను చేపడుతూ పొట్ట కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు స్వర్ణకారులు పేర్కొన్నారు. ఇతరులు.. కులవృత్తుల పని చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. స్వర్ణకారులు వంగాల గంగా కిషన్, గంగాధర్, చంద్రశేఖర్, ఉమా శేఖర్, ఉప్పల శ్రీనివాస్, శ్రీధర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇమ్యూనిటీ బూస్టర్ ప్యాకెట్ల పంపిణీ



బాన్సువాడ : బీర్కూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం దివ్యాంగులకు ఇమ్యూనిటీ బూస్టర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు రమేష్ మాట్లాడుతూ.. బీర్కూర్ మండలంలో ఉన్న 40 మంది దివ్యాంగులకు బూస్టర్ ప్యాకెట్లను అందజేశామని తెలిపారు. లయన్స్ క్లబ్ భవనంలో 18 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించామని వెల్లడించారు. కంటి పరీక్షల కోసం బోధన్ కంటి ఆస్పత్రికి పంపిస్తామని అన్నారు. లయన్స్ సభ్యులు సంతోష్, మేకల కార్తీక్, హైమద్ హుస్సేన్, కుమ్మరి సాయిలు, కిరణ్, గంగాధర్ తదితరులున్నారు.

సన్నరకం వడ్ల బోనస్ రైతులకు చెల్లించాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలల క్రితం రైతుల వద్ద కొనుగోలు చేసిన సన్నరకం వడ్ల బోనస్ డబ్బులు రైతుల ఖాతాలలో వెంటనే జమ చేయాలని బీకేఎస్ మండల అధ్యక్షుడు బసవరాజ్ దేశాయ్ కోరారు. మంగళవారం స్థానిక తహసీల్ కార్యాలయానికి రైతులతో కలిసి వెళ్లి తహసీల్దార్ దశరథ్‌కు వినతి పత్రం అందజేశారు. బీకేఎస్ మండల కార్యదర్శి బోడి రాజు, సహ కార్యదర్శి మల్లికార్జున్ యాదవ్, కుమార్ సింగ్ ,అప్రోజ్, మహేందర్ రైతుల తదితరులు పాల్గొన్నారు.